# వాగుర

బాల్యం వదులుతున్న రజని ఏకాహం చూడటానికి వెళ్ళింది. ప్రకృతి అంతా సుందరంగా కనబడే వయస్సు వచ్చింది రజనికి. వినబడేవన్నీ తీయగా వినబడే వారి యువ్వనం అంకురించింది. గొప్ప గాయకుడు కీర్తనపాడుతూ, తాళం వేస్తూ మహదానందంతో భగవంతుని దర్శిస్తున్నాడు. "వాగురమని తెలియక మృగగుణములు వచ్చితగులు రీతి యున్నది ఆయన పాడినవన్నీ విని ప్రసాదం తిని యింటికి వచ్చేసింది.

ఇల్లంతా భీభత్సంగా వున్నది. తల్లి కాళ్ళు జాపుకుని కూచుని యేడుస్తున్నది. ముసుగు తొలిగి పోయింది. విసిరేసిన అన్నం పళ్ళెం బోర్లపడి, గడపమీదున్నది. మంచి నీళ్ళ గ్లాసు దొడ్లో బావి దగ్గర పడింది. ముందు తల్లిని వోదార్చి కళ్ళు తుడిచి, ముసుగేసింది. మంచం వక్కా సర్ది దానిమీద పడుకోమన్నది. దుప్పటి కప్పింది. ఇల్లంతా సర్దింది. పళ్ళెం కడిగి తిన్నె మీదుంచింది. గ్లాసు తోమి అల్మరలో వుంచింది. అప్పుడు తల్లి దగ్గరకొచ్చింది.

•యెందుకేడుస్తావు అమ్మా! అన్న రాలేదా? లేచి అన్నం దిను. లేదా కాఫీతాగు త్వరగాచేసి తెస్తా జ్వరం వచ్చినట్లున్నది నాన్ రొట్టి తేనా? షాపు దగ్గరే? "వద్దమ్మా యెమొద్దు ఇవాళ వస్తూ "లంఖణం పరమౌషధం" అన్నేమో వచ్చాడు. నువ్వు కనబడలేదుట. ఇదేదీ? అని చిందులు తొక్కాడు. "ఏకాహం చూడటానికి వెళ్ళింది అంటూ అన్నం పెట్టాను. జ్వరంతోనె లేచి చేసిందని జాలైనాలేదు. యెందు కెళ్ళనిచ్చావు? అడ్డమైన

వాళ్ళతో తిరుగుతున్నది. "బయటికి పోనీకోకు." అని చెప్పానా అని తిట్టాడు. "ఆడుకునేయాడు. బయటికి పోనీయకపోతే యేడ వదా? మరీ మూర్ఖుడిలాగా వున్నావు. నువ్వు ముందు పెళ్లాడాలీ ఆ వెర్రికోపం తగ్గుతుంది. సంబంధాలు వస్తున్నాయి. యేదో వొకటి సెటిల్ చేసుకో." అన్నాను. దానిమీద ఇంకా విరుచుకు పడ్డాడు. "ఇప్పుడు నాకు పెళ్ళి తక్కువైందా? ముందు చెల్లికి పెళ్ళి చేసి పంపేయాలి. డబ్బేదీ? నువ్వు వచ్చింది వచ్చినట్టు ఖర్చు చేస్తూ యేమీ మిగలనీయవు. నీ అత్తవారూ, పుట్టింటి వారూ దాడిచేసి యిల్లు గుల్ల చేస్తూ వుంటారు." అన్నాడు. ఓ తాగుమోతు స్నేహితుడికి యిన్నిస్తానని మాటిచ్చాడుట, నిర్వా కం విని బాధ కలిగింగి. 'వీల్లేదు' అన్నాను. దానిమీద అన్నీ విసిరేసి, పగలగొట్టి, తిట్టి, అన్నం తినకుండా వెళ్ళిపోయాడు. అని యేడిచింది తల్లి. దేంట్లోనన్నా దూకుతాడేమో! అని రాగం తీసింది.

రజని ఆ రాత్రికి, అన్నం వండి కంది పచ్చడి చేసింది. వంకాయ ఉల్లిపాయ కలిపి యిగిరిక వండింది. చారు పెట్టింది. అన్నను మంచి చేసుకుని అన్నం తినిపించింది. తల్లికి కాఫీ, రొట్టె యిచ్చింది. అన్న యిచ్చిన డబ్బు అందుకుని డబ్బాలో వేసి దేముడి గూట్లో పెట్టింది.

నానమ్మా, యిద్దరు మేనత్తలూ, పెత్తండ్రి బ్రహ్మయ్య శాస్త్రి వచ్చారు. కృష్ణా పుష్కరాలుట. నానమ్మ, యిద్దరత్తయ్య లూ విధవరాళ్ళే. గుండ్లూ, గొవుల పింటింగున్న నేత ధోవతు లు కడతారు. రవికలుండవు, వృద్ధాప్యం మీద బడింది.

"బుల్లెమ్మా! రజనీ! చెంబట్టుకురా! బహిర్భూమి దూరమా? నా కర్రేది? నన్ను పట్టుకోనీముందు." నాయనమ్మ పొద్దున్నే కాలకృత్యాలు, స్నానం కానిస్తుంది. జపం మడిబట్ట ఆరేసి, ఆరాక తెచ్చుకుంటుంది. శుక్లాలేర్పడ్డాయి శుక్లాలు తీయించు కోవాలని వచ్చింది. మేనత్త ఆరిన ధావళీలు అండెంలో వుంచి గోడ మేకుకి వేలాడ తీస్తుంది. అది మడి. వాటిని రాత్రికి కట్టుకుని ఫలహారం చేస్తారు.

మేనత్తకి పళ్ళ బాధ. పీకేయించుకోవాలని వచ్చింది, కళ్ళద్దాలూ మార్పించు కోవాలి. పెత్తండ్రి కాంగ్రెస్ పార్టీ, సోషల్‌వర్క్ చేస్తాడు. యెన్నికల ప్రచారానికి వచ్చాడు. రజనిని క్షణం కూచో నివ్వకుండా పని తగిలించారు. తలారా స్నానం చేసి, తడిగుడ్డలతో వెళ్ళి కొళాయి నీళ్లు తెచ్చింది. దొడ్లో బావిలోని నీళ్ళు ఉప్పులు. నానమ్మ, మేనత్తలు ప్రయాణ మౌతుండగానే పెత్తండ్రి తన మనుమరాల్ని చంద్రావళిని దాని కొడుకు చెన్నకేశవుడిని తెచ్చాడు. చంద్రావళికి యెబార్షనైంది. బ్లీడింగ్ కట్టడం లేదు. లేడీ డాక్టరుకి చూపాలి. చెన్నకేశవుడికి కళ్ళకి ఇన్‌ఫెక్షన్ వారిపనులన్నీ పూర్తిఅయి వెళ్ళబోతున్నారు. పెత్తండ్రి పెద్ద మనిషిలాగా, పెత్తనదారులాగా అడిగాడు.

"రజనికి వివాహం చెయ్యవా? నాకు తెలిసిన సంబంధమున్నది. నేను నిశ్చయం చెయ్యనా?"

రజని తల్లి అన్నది. "యేదీ పదకొండోయేడాగా, చూస్తున్నాము. బడి కెల్తున్నది. యింట్లో వంటపనీ అందుకుంటున్నది,"

బడి దూరం, పనీ యెక్కువైంది. రజని బాగా తీసేసింది తల్లికి జాలేసి, చిరుతిండి చేసి తినిపించసాగింది.

అన్నెమో పెళ్ళి చేశాడు. అత్తింటికి తోలాడు. గొడ్లపాక వూడవటం, నీళ్ళు తోడి గాబుల్లో పోయటం, అటుకులు దంచటం పిండి విసరటం కాక పిల్లల్ని సాకే పని కూడా అంటుకున్నది. రజనికి వో వినోదం లేదు, విశ్రాంతి లేదు, బావగారికి ఉబ్బసం మొగుడికి జలుబు, అత్తగారికి కాళ్ళవాపు, ఆడపడుచుకి యెనీమియా, మరిది దేశ దిమ్మరి. అంటే మెడికల్ రిప్రజెంటెటివ్, తోడుకోడలుకి మూర్ఛలు, పాలేర్లకి చద్దిపెట్టి పంపించే సరికి పిల్లలకి బడివేళా, వుప్పుడు పిండి ఊరగాయ పెరుగూ తినీ వెళ్తారు. వంట సాయం. తిండి తింటూనే కందులూ, పెసలూ, మినుములూ బాగుచేసి విసరాలి. నోములు, వ్రతాలు, తద్దినాలు అంటే ఇంకా పని. అన్నం వేళ దాటుతుంది.

రాతి యుగంలోంచి యంత్రయుగంలోకి వచ్చింది రజనీ మొగుడు పట్నం వచ్చాడు, ఉద్యోగం పురుష లక్షణం అని రుజువు చేశాడు. వేష భాషలు మారినై, ఆచారాలూ, ఆనవాయితీలూ అడుగంటాయి. రజని మంచి నీళ్ళ కోసం యెదురింటికెళ్ళాలి. కొళాయి కట్టేస్తారు. పాలూ, కూరలు అందుకుని, పిల్లల్ని బడికి హాజరు చేస్తుండగానే, మొగుడు నరహరి గర్జిస్తూ వుంటాడు.

"రజని! సాక్సేవీ? కొత్తవి తెచ్చానె. ఇవి చిరిగి పోయాయి. కళ్ళజోడు కనబడలేదు." రజని నిముషాల మీద వెదికి తెచ్చి అందిస్తుంది. డ్రైవరుకి టీ పోయాలి. వంటంతా యాం

త్రాలతోనె యాంత్రికంగానె జరిగిపోతుంది. గాస్‌స్టౌవ్, కుక్కర్ కూర కుకర్, పాల కుకర్, గ్రైండరు అన్నీ భద్రంగా వాడుకోవాలి. లేకపోతే ప్రమాదం. మధ్యాహ్నం అన్నంపెట్టకెక్కిస్తుండగా సర్వెంటు వచ్చేస్తుంది.

"రజనీ!" అని కిటికీలోంచి, చూసి బెల్ కొడుతుంది? యెంతకీ తలుపు తీయవేం. పదిళ్ళల్లో పనిసేయాల టైమేది. నీవిచ్చే టీ బాగాలేదు. అన్నంలోకి కారంగా ఊరగాయ వేయి. నీ వంట బాగాలేదు.' అలా తప్పులు పడుతూనే గంటన్నవులోనే పనిచేసి ఉడాయిస్తుంది, అప్పుడు మంచినీళ్ళు తాగలేదని గుర్తొచ్చి కిచెన్‌లోకి వెల్తుంది రజని. ఫ్రిజ్‌లో ఐస్ నిండిందేమో చూసి ఆఫ్‌చెయ్యాలి. అంతా కరిగాక తుడవాల. ఆన్ చెయ్యాలి వాటర్ హీటర్ మరిచి పోగూడదు. మరీ సలసలా కాగుతాయి నీళ్ళు. టి.వి. ఆంటెన్నా సరిగా వుందా చూడాలి. టి.వి. మీద బొమ్మలు కదిలిపోతాయి, పత్రిక అందుకుంటునప్పటికి నిద్ర ముంచుకువస్తుంది. అన్నీ ఆర్పి ఫాన్లు ఆన్‌చేసి, యెర్రలైటు వేసి నిద్రకొరుగుతుంది. 'గృహిణి' అనె పేరెందుకూ? మర మనిషి అనో, రాబోట్ అనో అంటే మంచిది.?" అని నిద్రలో నవ్వుకుంటుంది.

రజని నరహరి అడుగు జాడల్లో అడుగులేస్తు రాకెట్ యుగంలోకి అడుగు పెట్టింది. పిల్లలు వాళ్ళిష్టమొచ్చిన వాళ్లని, వాళ్లిష్టమైన వయస్సులో వాళ్లకునచ్చిన పద్ధతిలో పెళ్లిళ్లు చేసుకున్నారు. మనుమలూ, మనుమరాళ్ళూ సరేసరి. వింత కట్టు జుట్టూ, వింత దుస్తులూ, డాడీ, పేడీ, మమ్మీ, మమ్, మమ్మీ అని పిలుస్తూవుంటారు. అదేం బాషో! నిద్ర లేచింది మొదలు

కొని అందరూ పరుగే. కోడళ్ళూ, కొడుకులూ, జాబ్స్‌లోకి పిల్లలు ఋళ్ళకీ, ఆడపిల్లలూ, అల్లుళ్లూ బిజినెస్ మీదా వెళ్లిపోతారు. ఇద్దరు వంటవాళ్ళూ, మాంసాహారం, శాఖాహారం విడివిడిగా వండుతారు. వాళ్లిద్దరూ మెయిడ్ సర్వెంట్సుతో సరసమాడుతూ, మేడమ్ రజని మీద అరుస్తు వుంటారు. తిండి గూడా మారిపోయింది. టిన్ ఫుడ్, ఇన్‌స్టెంట్స్‌తో తయారయే తినుబండారాలు లేదా గృహకల్ప, గృహప్రియ నించి తెచ్చుకుంటారు. మూడవ తరంవారు. చూయింగ్ గమ్‌తో చేసే వికార చేష్టలు చూడలేక రజని తన రూమ్‌లోకి పారిపోతుంది. పిల్లలు నవ్వుతారు.

ఇపుడు నరహరి ఫిల్మ్ ఫీల్డ్‌లో వున్నాడు. పేర్లున్నాయి. వేషమూ వేస్తాడు. మంచి పర్సనాలిటీ. ఎవర్‌గ్రీన్ హీరో అని పొగడుతుంటారతన్ని. సరికొత్తకారులో ఎక్స్ట్రా తారతో వస్తాడింటికి.

'రజనీ! యీ అమ్మాయి మనవాళ్ళే. బీరకాయ పీచు బాంధవ్యం. మెస్ తిండి పడటం లేదు. చిన్నప్లాటు కొనుకునె దాకా మనింట్లో వుంటుంది. స్పేర్ రూమ్ వున్నదిగా' అంటూనె పైకి తీసికెల్తాడా తారని.

సినిమాలకి రమ్మని, టి.వి, చూడమని, స్టూడియోకి పోదామని, షూటింగు చూద్దాం రమ్మని పిల్లలు అడుగుతారు. హర్ట్ చెయ్యలేక రజని వెళ్తుంది. కాని ఆ అటవిక నృత్యాలు, మేకప్ చూడలేక నీరసిస్తుంది. సతీ సక్కుబాయి, సీతా కళ్యాణం, శ్రీరామ జననం, లవకుశ, వేంకటేశ్వర మహాత్యం, దత్తదర్శనం సంపూర్ణ రామాయణం, ద్రౌపదీ మాన సంరక్షణ చూసిన కళ్ళ

తో కొత్తగా విడుదలయ్యే సినిమాలు చూడలేక పోయింది హత్యలూ, మానభంగాలూ, కొట్లాటలూ చూడలేక కళ్ళు మూసు కెంటుంది,

డబ్బేమో మంచినీళ్ళులాగా వాడుకున్నారు. సినిమాలు రోజుకి పది విడుదల అవుతుంటే హీరోయిన్లు పంటలు పండినట్లు తెరమీదికెక్కుతున్నారు. అనేకరకాల జబ్బులు, వాటిని మించిన మందులు వచ్చాయి,

నరహరి తానే డైరెక్టరయినాడు. దాంతో ప్రాధాన్యసరూ కాగలిగాడు. కలర్ లాబ్ రన్ చేస్తున్నాడు. పండగనాడు దైవ దర్శనమైనట్టు దర్శనమిస్తాడు. యెవరి విషయాలో మాట్లాడ తాడు. యెవరినో బాగుచేసానంటాడు. ఒక్కో ఫిల్ము డబ్బుచేయ లేక డబ్బాలోనె నిద్రబోతుంది. అరోజు నరహరి నరసింహావతా రమెత్తుతాడు. దేవుడనుకూలించి, ఒక ఫిల్ము లక్షలు తెచ్చియి స్తుంది. అపుడు బ్రహ్మానందంలో మునిగి యెలా తెచ్చిందీ. తె లుసుకొని కమర్షియల్ పిక్చర్ అర్టు పిక్చర్, ఇంటర్నేషనల్ పిల్మ్ తీయాలని తీర్మానించుకొని కెనడా స్టేట్సు వెళ్తాడు. షూటిం గ్ కని వెల్తున్నాను అంటాడు.

నీక్కూడా చిన్న పార్టు యిప్పించమన్నావా? రజనీ! నీకు పాత్రవుండేటట్టు వ్రాస్తారు కవులు అన్నాడోసారి రజనితో రజని నవ్వి అవతలికి వెళ్లిపోయింది.

ఈమాటు నరహరివెళ్లి యాడాదైంది. మనుమలూ, మను మరాల్లు విదేశాలకు వెళ్ళాలని. పిల్ముఫీల్డులోకి వెళ్లి గ్లేమరు సం

పాయించాలని ఎలక్ట్రానిక్స్, టివి, వీడియో వంటి బిజినెస్ పెట్టు కోవాలని ఆరాట పడడం చూసింది.

రజని చిన్నతనంలో కాలం నత్త నడక నడిచేది. యే పని చేసినా తీరిగ్గా చేసుకునేవాళ్లు. కాలం మారింది. ఇప్పుడు శర వేగంతో పరుగెత్తుతుంది. తీరికే లేదు.

చూస్తుండగానె యెదురుగా ఐదంతస్తుల ఫ్లాటు లేచింది. ఒక భాగం యజమానురాలు వచ్చి, బొట్టుపెట్టి, ఆహ్వాన పత్రిక ఇచ్చి పేరంటం భోజనం అని చెప్పింది.

రజనీ! నేను పాతకాలం మనిషిని దేవుని దయవలన నెగ్గు కొచ్చాను, అందుకని ఏకాహం చెయ్యాలని తలపెట్టాను. అమ్మ వారికి చిన్న గుడి కట్టించా. ఈఆవరణలోనే. విరామం లేకుండా నామ సంకీర్తనం జరుగుంది. రాత్రికి హరికథ, వ్రతం, భజనా నాట్యం, పాటకచేరి, అలా జరుగుతాయి. నీకు వీలున్నప్పుడే రావచ్చు. బోజనానికుండాలి. వస్తా కూతురా," అని పీవుమీద రాసి పెళ్ళింది.

రజని అమ్మవారికని చీరా, రవికల గుడ్డ, పళ్ళూ, పూలు, టెంకాయ, పూదొత్తులూ, పసుపు,కుంకం,కర్పూరం అన్నీ పళ్లెం లో అమర్చుకుని బయలుదేరింది. సర్వెంటు "నేను తీసుకురానా పళ్ళెం?" అనడిగింది.

"వద్దు" అని వెళ్ళబోయింది రజని.

"మరి నే తెచ్చిన నీళ్ళు తాగుతున్నావే?" అని నవ్వింది.

"అవును అవన్నీ రోజూ వుండేవే ఈ ఒక్క రోజుకు యిలా వెళ్లాల నుకున్నాను." అని వెళ్ళిపోయింది.

అప్పటికి, కృష్ణలీలాతరంగిణిలోని తరంగం పూర్తి అయి పాడినాయన లేచాడు. వెంటనే మరో గాయకుడు అక్కడే కూచుని "వాగురమని తెలియక" అని అందుకున్నాడు. రజని వళ్లు పులకరించింది. చాలా సంతోషం కలిగింది. మనసారా మొక్కింది. తెచ్చినవి అక్కడుంచి, పరమేశ్వరి పఠం చూస్తూ పాటవింటూ తన్మయత్వం చెందింది.

]•[ × ]•[